క్లుప్తంగా

దేవాలయాల నిర్మాణాలకు భూమిపూజ



దేవాలయాల నిర్మాణాలకు భూమిపూజ చేస్తున్న గ్రామస్తులు

కేశంపేట: మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో నూతనంగా శివాలయం, గణపతి, నవగ్రహాల మండపం, నాగదేవతల విగ్రహ ప్రతిష్ఠ, ఆలయానికి సంబంధించిన వస్తువులను భద్రపరిచేందుకు స్టోర్‌రూంను నిర్మించేందుకు గ్రామస్తులు సోమవారం భూమిపూజ చేశారు. శివాలయ నిర్మాణానికి పసులాది ఉమాపతిరెడ్డి, నవగ్రహ మండపాలను బాణాల శ్యాంకుమార్, స్టోర్‌రూం నిర్మాణానికి యంసాని నర్సింలు గుప్తలు ముందుకొచ్చారని గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తుల అందరి సహకారంతో గణపతి, నాగదేవత ఆలయ నిర్మాణాలను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పల్లె బాలీశ్వర్, జగన్‌మోహన్‌రెడ్డి, శ్యాంకుమార్, శ్రీనివాస్, కృష్ణయ్య గౌడ్, లింగం, శేఖర్, మల్లేశ్‌గౌడ్, యాదయ్య, అంజయ్య పాల్గొన్నారు.

ఆర్థికసాయం

కేశంపేట: మండల కేంద్రమైన కేశంపేట గ్రామానికి చెందిన సిరిగిరి జంబులమ్మ మృతి చెందింది. మృతురాలిది నిరుపేద కుటుంబం కావడంతో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి, గంద్రాతి రమణయ్యగౌడ్‌లు రూ.5వేల చొప్పున, తలసాని పవన్ కుమార్‌రెడ్డి రూ.3వేల ఆర్థికసాయాన్ని మృతురాలి కుటుంబ సభ్యులకు సోమవారం అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు మంచె కృష్ణయ్య, గంజాయి దశరథ, మారం వెంకటయ్య, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి కార్తీకమాస లక్ష దీపోత్సవం

షాద్‌నగర్: కార్తీకమాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని హాజిపల్లి రోడ్డులో ఉన్న గౌరీ గార్డెన్ ఎదురుగా ఉన్న ఆకుల మాణయ్య మైదానంలో ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు ఛత్రపతి శివాజీ కల్చరల్, సోషల్ ఆర్గనైజేషన్, మాత టెంట్‌హౌస్ అండ్ ఆయిల్స్ వారి ఆధ్వర్యంలో కార్తీకమాస లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా 28న సాయంత్రం 5గంటలకు వేద ఘోష, గోపూజ, రుద్రాభిషేకం, బిల్వార్చన, పుష్పార్చన, కార్తీక దీపారాధన, మహా మంగళహారతి, 29న గోపూజ, రుద్రాభిషేకం, శివపార్వతుల కల్యాణం, బిల్వార్చన, 30న మహామృత్యుంజయ పాశుపత వేద ఘోష, గోపూజ, రుద్రాభిషేకం, పుష్పార్చన, కార్తీక దీపారాధన వంటి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు సింగారం శ్రీనివాస్ తెలిపారు. మూడురోజుల పాటు నిర్వహించే లక్ష దీపోత్సవ కార్యక్రమానికి ఆచార్య గౌరయ్యస్వామి, ఆనందాచార్యులు, సద్గురు శ్రీ నిత్యశుద్ధానంద స్వామి క్షేత్రం శ్రీశివానందస్వామి ముఖ్య అతిథులుగా విచ్చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాలకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు వివిధ పార్టీల నాయకులతో సమావేశం

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం స్థానిక సంస్థల ఎన్నికల జాబితాపై సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ బన్సీలాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల దష్ట్యా అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిస్తున్నామని, ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి నాయకులు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఇస్లామిక్ కాంగ్రికేషన్ ఏర్పాట్లపై సమీక్ష

చేవెళ్ల: జనవరి 4, 5 తేదీలలో శంకర్‌పల్లిలో నిర్వహించే ఇస్లామిక్ కాంగ్రికేషన్(ఇస్తేమా) ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులు సమీక్ష నిర్వహించారు. సోమవారం శంకర్‌పల్లిలో చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ, నార్సింగి ఏసీపీ రమణగౌడ్ ఆధ్వర్యంలో ఇస్లామిక్ కాంగ్రికేషన్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు శంకర్‌పల్లిలోని జంబోరి గ్రౌండ్‌లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుంచి సుమారుగా 2లక్షల మంది వరకు వస్తారని నిర్వాహకులు అధికారులకు తెలిపారు. ఇస్తేమాకు వచ్చే వారికి తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరారు. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి వచ్చే వారికి తగిన ఏర్పాట్లు తాగునీరు, వైద్యం, రవాణా సౌకర్యం తదతర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారితో పాటు తహసీల్దార్ సురేందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఎంపీడీఓ వెంకయ్యగౌడ్, శంకర్‌పల్లి ఐసీ శ్రీనివాస్‌గౌడ్, ఫైర్ అధికారి కమాకర్, వైద్యాధికారులు రేవతి, శ్రీనివాస్, విద్యుత్ ఏఈ ప్రదీప్, ఎంపీఓ గిరరాజ్, ఇస్లామిక్ పెద్దలు పాల్గొన్నారు.

నిద్దరోతున్న 'నిఘా' నేత్రాలు

- అలంకారప్రాయంగా సీసీకెమెరాలు
- భారంగా మారుతున్న నిర్వహణ
- పెరుగుతున్న నేరాలు, దొంగతనాలు
- పట్టించుకోని అధికారులు



జాతీయ రహదారి తిమ్మాపూర్ రైల్వేస్టేషన్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన కెమెరాలు



పెంజర్ల రోడ్డులో పనిచేయని కెమెరాలు

కొత్తూరు: గతంలో ఏ చిన్న నేరం జరిగినా పోలీసులు నిందితులను గుర్తించడానికి చాలా కష్టపడాల్సి వచ్చేది. నేరాల ఛేదనకు రోజుల తరబడి శ్రమించిన తగిన ఫలితాలు వచ్చేవి కావు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతికతను వినియోగించుకుంటున్న పోలీసులు ఆయా నేరాలకు పాల్పడిన వారిని కొన్ని గంటల్లోనే గుర్తించగలిగే సామర్థ్యాన్ని అందిపుచ్చుకుంటున్నారు. పోలీసులకు నేరాల ఛేధన, నేరస్తుల గుర్తింపులో సీసీ కెమెరాలు అత్యంత కీలకంగా మారాయి. ఏ ప్రాంతంలోనైనా నేరాలు, ప్రమాదం జరిగితే దానికి గల కారణాలు, కారకులను కచ్చితంగా గుర్తిస్తూ వారిని కటకటాల పాలు చేస్తున్నారు. కొత్తూరు మండలంలో దాతలు, ఇతరుల సహకారంతో గతంలో 400 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా ప్రస్తుతం 190 మాత్రమే అందుబాటులో ఉండగా మిగిలిన కెమెరాలు మరమ్మతులకు గురయ్యాయి.

నామమాత్రంగా..

కొత్తూరు పట్టణంలో ఇటీవల ఓ బాలికను గుర్తు తెలియని వ్యక్తి ఇంటి వద్ద నుంచి అపహరించుకెళ్లాడు. విషయం తెలిసిన పోలీసులు బాధితుడి ఇంటికి వెళ్లి వివరాలు తెలుసుకొని సమీపంలోని ఇళ్లలో ఏర్పాటు చేసిన కెమెరాలను చూసి కిడ్నాప్‌కు గురైనట్లు గుర్తించారు. కిడ్నాప్‌కు పాల్పడిన వ్యక్తి ఈ ప్రాంతానికి కొత్త కావడం, అతడి వివరాలు ఎక్కడా లేవు. కేవలం సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాల ఆధారంగానే నిందితుడి వివరాలను తెలుసుకున్నారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న కెమెరాల నిర్వహణ మండలంలో నామమాత్రంగా కొనసాగుతోంది. చాలా కూడళ్లు, ఆయా ప్రాంతాల్లో పోలీసులు ఏర్పాటు చేసిన కెమెరాలు ప్రస్తుతం పనిచేయడం లేదు.

భారంగా నిర్వహణ..

నేరాల ఛేదనలో పోలీసులకు ప్రస్తుతం సీసీ కెమెరాలు అత్యంత కీలకంగా మారాయి. అంతటి ప్రాధాన్యత ఉన్న కెమెరాలకు ప్రస్తుతం నిర్వహణ భారంగా మారింది. పోలీసుల ఆధీనంలో కొనసాగుతున్న కెమెరాల నిర్వాహణకు సొంత శాఖ నుంచి ఎలాంటి నిధులు రావడం లేదు. దాతలు, ఇతరుల సహకారంతో పోలీసులు ఎప్పటికప్పుడూ ఆయా ప్రాంతాల్లో కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. కాగా గాలులు, వర్షాలు, భారీ వాహనాల రాకపోకల సమయంలో కెమెరాలకు ఏర్పాటు చేసిన తీగలు తెగిపోతున్నాయి. తిరిగి వాటిని మరమ్మతులు చేపట్టడం పోలీసు శాఖకు భారంగా మారుతోంది. దీనికితోడు ఎప్పటికప్పుడూ కెమెరాలు మరింతగా అప్‌డేట్ అవుతున్నాయి. వీటిని ఏర్పాటు చేసుకోవడానికి సైతం పోలీసులు దాతలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది.

కొత్తవి ఏర్పాటు చేస్తాం



గతంలో కొత్తూరు మున్సిపాలిటీతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో దాతలు, ఇతరుల సాయంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కొన్నిచోట్ల కెమెరాలు పనిచేయడం లేదు. త్వరలో పనిచేయని కెమెరాలను గుర్తించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తాం. ముఖ్యంగా వ్యాపారులు, అపార్ట్‌మెంట్లు, ప్రజలు తమ ఇళ్ల ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడానికి ముందుకురావాలి.

– నర్సింహారావు, సీఐ, కొత్తూరు

మాలల హక్కులను పరిరక్షించాలి

ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి



సింహగర్జన వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తదితరులు

షాబాద్: మాలల హక్కులను ప్రభుత్వం పరిరక్షించాలని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. సోమవారం నగరంలో మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్, జిల్లా అధ్యక్షుడు చొక్కంపేట ఆంజనేయులుతో కలిసి డిసెంబర్ 1న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే మాలల సింహగర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 30 లక్షల మాలల జనాభా ఉందన్నారు. కులాల ప్రకారం రెండోస్థానంలో ఉన్న మాలలకు రాజకీయంగా మరింత గుర్తింపు రావాల్సి ఉందన్నారు. మాలలు తమకు కల్పించిన హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని సూచించారు. ఆత్మగౌరవం, హక్కుల కోసం జరిగే పోరాటానికి ప్రతీ మాల సోదరుడు కలిసి రావాలన్నారు. వర్గీకరణ చట్ట వ్యతిరేకమైనదని, మాలలు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అరుణ్‌కుమార్, ప్రభాకర్, కిరణ్ కుమార్, వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

సింహగర్జనను విజయవంతం చేయండి

మాల మహానాడు నియోజకవర్గ కన్వీనర్ బుచ్చయ్య



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ ఎస్సీ వర్గీకరణ చేయడం బాధాకరమని షాద్‌నగర్ నియోజకవర్గ మాల మహానాడు నియోజకవర్గ కన్వీనర్ బుచ్చయ్య అన్నారు. డిసెంబర్ 1న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించ తలపెట్టిన సింహగర్జనకు సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం మండల పరిధిలోని అన్నారం గ్రామంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన బుచ్చయ్య మాట్లాడుతూ.. వర్గీకరణకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో మాలలు పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా డిసెంబర్ 1న హైదరాబాద్‌లోని పరేడ్ మైదానంలో మాలల సింహగర్జన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ గ్రామం నుంచి మాలలు పెద్దఎత్తున ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు నియోజకవర్గ కోకన్వీనర్ అర్జున్‌కుమార్, మాజీ ఎంపీటీసీ భీష్వ రామకృష్ణ, నర్సింలు, రామ్మూర్తి, రాంచందర్, మహేందర్, మహేష్ మాల, విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఓ నిషాంత్‌కుమార్

ఏఓ నిషాంత్‌కుమార్

షాద్‌నగర్: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని మండల వ్యవసాయ అధికారి నిషాంత్‌కుమార్ సూచించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు, ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి మేరకు సోమవారం షాద్‌నగర్ మార్కెట్‌యార్డుకు మార్చారు. ఈ కొనుగోలు కేంద్రాన్ని ఏఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోద్దని సూచించారు. చాలా మంది వ్యాపారులు నేరుగా గ్రామాలకు వచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారన్నారు. వ్యాపారుల మాటలు నమ్మి రైతులు మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈఓ రఘునందన్, ఏఈఓ తేజ్ కుమార్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ అధ్యక్షుడిగా ఆనంద్

కొందుర్గు: ఎమ్మార్పీఎస్ కొందుర్గు మండల కమిటీ అధ్యక్షుడిగా అనెగాళ్ల ఆనంద్ ఎన్నికయ్యారు. సోమవారం జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆనంద్, అధికార ప్రతినిధిగా దుర్గని శ్రీను, ప్రధాన కార్యదర్శిగా రమేశ్, ఉపాధ్యక్షులుగా వెంకటేశ్, సాయిలు, బాలయ్య, కోశాధికారులుగా అంజయ్య, ప్రేమ్‌కుమార్, కార్యదర్శులుగా నర్సింలు, బాలాంజనేయులు, చంద్రయ్య, శ్రీను, శేఖర్, ప్రచార కార్యదర్శులుగా కృష్ణ, సుదర్శన్, యాదయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నర్సింహ ఎన్నికయ్యారు.

సంగమేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న మహిళలు

మొయినాబాద్‌రూరల్: కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో మండల పరిధిలోని కనకమామిడి సంగమేశ్వర దేవాలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శివలింగానికి అభిషేకాలు, గజస్తంభం వద్ద దీపాలు వెలిగించారు. భక్తులందరికీ ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

క్రీడాకారుల అభ్యున్నతికి కృషి



షాద్‌నగర్: ఎమ్మెల్యేను సన్మానిస్తున్న క్రీడాకారులు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: క్రీడామైదానాలు, క్రీడాకారుల అభ్యున్నతికి మరింత కృషి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని మినీస్టేడియం అభివృద్ధికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించినందుకు సోమవారం క్రీడాకారులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో క్రీడాకారులు ఆయనను కలిసి ఈ సందర్భంగా శాలువా కప్పి సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో క్రీడాకారులకు ఇచ్చిన హామీమేరకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో ఎంతో మంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని, వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు వేదికైన క్రీడామైదానాలు, మినీస్టేడియంలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహాన్ని, సదుపాయాలను క్రీడాకారులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని క్రీడల్లో మరింత రాణించాలని సూచించారు. కార్యక్రమంలో చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బస్వం, ముబారక్, కబీర్ అహ్మద్, మహమూద్, చిన్న, సురేశ్, రమణ, శ్రీపాల్, ప్రభు, మహేందర్, రషీద్, మతిన్, కిరణ్, సతీశ్, రామకృష్ణ, నర్సింహ, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయ సందర్శన

నందిగామ: అద్దె భవనంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్న రెవెన్యూ సిబ్బందికి సాధ్యమైనంత త్వరగా సొంత భవనం నిర్మించేందుకు కృషి చేస్తానని, అందుకు కావాల్సిన స్థలం గుర్తించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల కేంద్రమైన నందిగామలోని తహసీల్దారు కార్యాలయాన్ని ఎమ్మెల్యే సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో సిబ్బందితో ఆయన మాట్లాడారు. నందిగామలో తహసీల్దారు కార్యాలయానికి అనువైన స్థలాన్ని గుర్తించాలని తహసీల్దారు రాజేశ్వర్‌కు సూచించారు. స్థలాన్ని గుర్తించినట్లయితే సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి అధికారికంగా స్థలాన్ని తహసీల్దారు కార్యాలయానికి కేటాయించేందుకు కృషి చేస్తానని, వీలైనంత తొందరలో భవన నిర్మాణానికి భూమిపూజ కూడా చేద్దామని అధికారులకు వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జంగ నర్సింహాయాదవ్, మాజీ ఎంపీటీసీ దేపల్లి కుమార్‌గౌడ్, నాయకులు జిలెల్ల బాల్‌రెడ్డి, లింగం, ఎర్రగారి రమేశ్, రాములు, మహేశ్, జంగయ్య, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన

పలుగుట్ట గ్రామాన్ని సందర్శించిన ఉద్యాన కళాశాల విద్యార్థులు



జీపీ కార్యాలయం వద్ద ఉద్యాన కళాశాల విద్యార్థులు

చేవెళ్ల: మండలంలోని పలుగుట్ట గ్రామాన్ని కొండా లక్ష్మణ్ రాష్ట్ర ఉద్యాన కళాశాల విద్యార్థులు సందర్శించారు. సోమవారం గ్రామంలోని లిల్లీ పంట సాగు పరిశీలించి రైతులతో పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉద్యాన కళాశాల విద్యార్థులు గ్రామీణ ఉద్యాన పంటల సాగు అవగాహన (రూరల్ హార్టికల్చర్ వర్క్ ఎక్స్‌పీరియన్స్) కార్యక్రమంలో భాగంగా మూడునెలల పాటు క్షేత్ర పర్యటనలు ఉంటాయని చెప్పారు. ఇందులో భాగంగా పలుగుట్ట గ్రామాన్ని సందర్శించినట్లు చెప్పారు. గ్రామానికి సంబంధించిన వివరాలను కార్యదర్శి రాధ, ఎంపీఓ విఠలేశ్వర్‌జీని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉద్యాన కళాశాల విద్యార్థులు వెంకటేశ్, పవన్, శ్రీకాంత్, శివసాయి, రాజు, శ్రావణ్‌రెడ్డి ఉన్నారు.

ఘనంగా సహస్ర చండీయాగం



సహస్ర చండీయాగంలో పాల్గొన్న దాత విఘ్నేశ్‌గౌడ్ దంపతులు

చేవెళ్ల: మండలంలోని ధర్మసాగర్ గ్రామ సమీపంలో ఉన్న బంగారు మైసమ్మ దేవాలయాన్ని దాత విఘ్నేశ్‌గౌడ్ సొంత నిధులు రూ.15లక్షలు ఖర్చు చేసి అభివృద్ధి చేశాడు. ఈ సందర్భంగా ఆయన వేద పండితులతో సోమవారం ఆలయం వద్ద సహస్ర చండీయాగం నిర్వహించారు. అర్చకుడు శ్రీపాద ఆధ్వర్యంలో సహస్ర చండీయాగం, దేవాలయ శిఖరస్థాపన, గణపతి పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వర్ధన, స్నాపనము, జలాధివాసము, ధాన్యాధివాసము, పూర్ణహుతి కార్యక్రమాలు చేపట్టారు. విశ్వశాంతిని కోరుతూ ఈ సహస్ర చండీయాగం నిర్వహించినట్లు దాత విఘ్నేశ్‌గౌడ్ తెలిపారు. దాత తన కుటుంబసభ్యులతో కలిసి ఆలయం వద్ద చేపట్టిన కార్యక్రమాల్లో పాల్గొని పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సర్వేలో వివరాలు నమోదు చేసుకోవాలి

మున్సిపల్ కమిషనర్ వెంకన్న



షాద్‌నగర్: మాట్లాడుతున్న కమిషనర్ వెంకన్న



షాద్‌నగర్‌రూరల్: మాట్లాడుతున్న ఎంపీడీఓ బన్సీలాల్

షాద్‌నగర్: ప్రభుత్వం నిర్వహిస్తున్న సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కులగణన సర్వేలో ప్రజలందరూ తమ వివరాలను విధిగా నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకన్న కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని 28 వార్డుల్లో కులగణన సర్వే ముమ్మరంగా కొనసాగుతోందని తెలిపారు. సర్వే తుది దశకు చేరుకుందన్నారు. మరో రెండు రోజుల్లో మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో సర్వే పూర్తవుతుందన్నారు. అధికారులు ఇంటింటికీ వచ్చినప్పుడు అందుబాటులో లేనివారు తమ వివరాలను విధిగా సర్వే అధికారులకు తెలియజేయాలన్నారు. ఇప్పటివరకు సర్వేలో వివరాలు నమోదు చేసుకోవారు వెంటనే ఎన్యుమరేటర్లను లేదా మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించి వివరాలు నమోదు చేయించుకోవాలని తెలిపారు.

మరో రెండురోజులు అవకాశం

కొత్తూరు: సమగ్ర కుటుంబ సర్వేకు మరో రెండు రోజుల(ఈ నెల 27) వరకు అవకాశం ఉన్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి అరుంధతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఎన్యుమరేటర్లు గ్రామాల్లో పర్యటించి సర్వే వివరాలు నమోదు చేసినట్లు వివరించారు. కాగా ఇప్పటివరకు సర్వే వివరాలు వెల్లడించని వారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ వద్దకు వచ్చి వివరాలు వెల్లడించాలని సూచించారు.

నేడు సమగ్ర సర్వేకు చివరి గడువు

కేశంపేట: ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేకు మండలంలో నేటి వరకు గడువు ఉన్నట్లు ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని 29 గ్రామ పంచాయతీల పరిధిలో 13,572 కుటుంబాలను గుర్తించామని, ఇప్పటివరకు 97 శాతం సర్వే పూర్తయినట్లు ఆయన తెలిపారు. సర్వే చేయించుకోని వారు, ఇళ్లకు తాళాలు వేసి వేరే ఊళ్లకు వెళ్లిన వారు గ్రామాల్లో అందుబాటులో ఉన్న ఎన్యుమరేటర్లకు సమాచారం అందించి సర్వేకు సహకరించాలని ఆయన కోరారు. ప్రజలకు ఎవరికైనా సందేహాలు ఉంటే మండల హెల్ప్‌లైన్ నంబర్లకు ఫోన్ చేయగలరని తెలిపారు. మండల హెల్ప్‌లైన్ నంబర్లు 9160389309 (మండల స్టాటిస్టికల్ అధికారి), 8125209849 (మండల పంచాయతీ అధికారి)లను సంప్రదించాలని ఆయన కోరారు.

సర్వేకు సహకరించాలి

షాబాద్: కుటుంబ సమగ్ర కుటుంబ సర్వేకు మండల ప్రజలందరూ సహకరించించాలని ఎంపీడీఓ అపర్ణ కోరారు. సోమవారం షాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ.. మండల పరిధిలోని 41 గ్రామ పంచాయతీల ప్రజలు ఎవరైనా కుటుంబ సమగ్ర సర్వే వివరాలు నమోదు చేయించుకోకపోతే ఈ నెల 26లోపు ఇంటి దగ్గరికి వచ్చే ఎన్యుమరేటర్లకు అవసరమైన సమాచారం అందించి మీ కుటుంబ సమగ్ర సర్వేనూ పూర్తి చేసుకోవాలని ఆమె మండల ప్రజలను సూచించారు. ఇప్పటి వరకు 98 శాతం పూర్తయిందని, సర్వేలో ఎవరైనా వివరాలు ఇవ్వని వారు ఉంటే వెంటనే నమోదు చేసుకోవాలన్నారు. ఏదైనా వివరాలకు కోసం 9949995469 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

99శాతం సర్వే పూర్తి

షాద్‌నగర్‌రూరల్: సమగ్ర కుటుంబ సర్వేలో వివరాలను మరో రెండు రోజుల్లో నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ బన్సీలాల్ కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండల పరిధిలో 18,020 నివాస గృహాలను గుర్తించామని, ఇప్పటివరకు 99శాతం సర్వే పూర్తి చేశామన్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు ఫోన్ ద్వారానైనా అధికారులకు తమ కుటుంబ వివరాలను తెలియజేసి నమోదు చేయించుకోవాలన్నారు. ఫోన్‌ద్వారా సర్వే చేసుకునేందుకు, సర్వేపై ఏమైనా అనుమానాలు ఉన్నా 94419 47364లో సంప్రదించాలని సూచించారు.